క్లుప్తంగా

ఆర్టీసీ బస్టాండ్‌లో ఉచిత వైద్య శిబిరం



నెల్లూరు సిటీ: నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందికి వివిధ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్‌లు మోహన్‌రెడ్డి, వైష్ణవి, విజయకుమార్ పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణా తరగతులు



శిక్షణా తరగతుల్లో పాల్గొన్న బీఎల్‌వోలు

నెల్లూరు సిటీ: రూరల్ బీఎల్‌వో(బూత్ లెవెల్ ఆఫీసర్లు)లకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం శిక్షణ ఇచ్చారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ప్రసన్నకు పలువురి పరామర్శ



ప్రసన్నను పరామర్శిస్తున్న బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి

నెల్లూరు (పొగతోట) : మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పరామర్శించారు. నగరంలోని ప్రసన్న నివాసానికి గురువారం చేరుకుని జరిగిన ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ప్రసన్న తల్లిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

⇨ నెల్లూరు (పొగతోట): మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి ఇందుకూరుపేట మండలం నిడుముసలి, బుచ్చి నగర పంచాయతీ నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు గురువారం చేరుకున్నారు. ప్రసన్న మాతృమూర్తిని పరామర్శించారు.

ఉపాధ్యాయులకు సత్కారం



నెల్లూరురూరల్: గురు పూర్ణిమ సందర్భంగా నెల్లూరు గుప్తా పార్క్ వద్ద ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ గురువారం సన్మానించారు. అనంతరం భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. హేమంత్, పెంచలయ్య, శ్రీనివాసులు, సత్య, మధు, అంకయ్య, రాజు, లక్ష్మి, తులసి, సాయి, ప్రసాద్, కృష్ణ, బాలాజీ, ఖజామస్తాన్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీకృష్ణరాయబారం



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శ్రీకృష్ణధర్మరాజ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీకృష్ణరాయబార ఘట్టం శాస్త్రోక్తంగా జరిగింది. ఉభయకర్తలుగా ఆదూరు ప్రభాకర్, గంధవళ్ల దశరథరామయ్య, భ్రమర మల్లికార్జున, దివ్యభారతి కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఈఓ జానకి, బ్రహ్మోత్సవ సేవా కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో గురుపూర్ణిమ

• సాయినామస్మరణతో పులకించిన మందిరాలు

నెల్లూరు(బృందావనం): నగరంలో గురు పూర్ణిమను గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సాయినాథుని సన్నిధిలో వేకువజాము నుంచి రాత్రి వరకు విశేషంగా హారతులు, అభిషేకాలు, అఖండ సాయినామ సంకీర్తనలు, అన్నసంతర్పణలు, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, పండరి భజనలు, కోలాటాలు వంటి కార్యక్రమాలు విశేషంగా జరిగాయి.

⇨ బాలాజీనగర్ శివారు పద్మావతి నగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో సాయినాథునికి విశేష హారతులు ఇచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 'ఓం సాయి.. శ్రీసాయి.. జయజయ సాయి' అఖండ సాయినామ సంకీర్తన, విష్ణుసహస్రనామ పారాయణాన్ని సామూహికంగా నిర్వహించారు. రాత్రి 7 నుంచి 10 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఊంజల్ సేవ, పవళింపు సేవలను భక్తిప్రపత్తులతో జరిపించారు. సుమారు నాలుగు వేల మందికిపైగా భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు. ఉభయకర్తలుగా కృష్ణగిరి దేశ్‌పాల్ సింగ్– దేవకిదేవి, చిట్లూరి వెంకటేశ్వర్లు(సీవీ)– ఝాన్సీలక్ష్మి దంపతులు వ్యవహరించారు. మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి, గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య పర్యవేక్షించారు.



బాలాజీ నగర్‌లోని అద్దాల మందిరంలో..

⇨ చిల్డ్రన్స్‌పార్కు రోడ్డులోని సాయిబాబా మందిరంలో, సంతపేట పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంతంలోని సాయిబాబా మందిరంలో విశేష పూజలు, అభిషేకాలు, అన్నసంతర్పణ జరిగింది. రామ్‌నగర్ శిరిడీ మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న సాయిబాబా మందిరంతో పాటు నగరంలోని నిప్పోసెంటర్, వేదాయపాళెం, డైకస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉన్న బాబా మందిరాల్లో గురు పూర్ణిమను నేత్రపర్వంగా నిర్వహించారు.

⇨ బీవీనగర్‌లోని సాయిబాబా మందిరంలో ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన, అభిషేక పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం సంధ్యా హారతి, రాత్రి పల్లకిసేవ నిర్వహించారు. ఉభయకర్తగా మందిర కమిటీ చైర్మన్ కిలారి వరుణ్‌కుమార్ వ్యవహరించారు.



బీవీనగర్ సాయిబాబా మందిరంలో..

⇨ మూలాపేటలోని వేణుగోపాలస్వామి దేవస్థాన గోశాలలో బీజేపీ నేతలు గోపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బీజేపీ నేత మిడతల రమేష్, ఏవీ సుబ్బయ్య, టి.శ్రీనివాసులు, శిరీష, నారాయణరావు పాల్గొన్నారు.

⇨ ఇస్కాన్ టెంపుల్ రోడ్డులోని హనుమాన్ మందిరంలో గురు పూర్ణిమ సందర్భంగా గురువారం భక్తిగీతాలను ఆలపించారు. గోవిందరాజు సుభద్రాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హర్షవర్ధిని, పద్మావతి, శ్రీవత్సల పాల్గొన్నారు.





చిల్డ్రన్స్ పార్క్ రోడ్డులోని సాయిబాబా మందిరంలో..



వేణుగోపాలస్వామి దేవస్థానంలో గో పూజ



హనుమాన్ మందిరంలో గీతాలాపన

పాఠశాలలు, కళాశాలల్లో పీటీఎం

నెల్లూరు (టౌన్): జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పేరెంట్స్, టీచర్స్ సమావేశాలను గురువారం నిర్వహించారు. స్థానిక వెంగళరావునగర్‌లోని మున్సిపల్ హైస్కూల్లో జరిగిన సమావేశంలో కార్పొరేటర్ అవినాష్, హజరత్తయ్యనాయుడు, హెచ్‌ఎం మంజులవాణి, వైద్యురాలు రీనా భారతి హాజరయ్యారు.

⇨ స్థానిక శివగిరి కాలనీలోని శ్రీకృష్ణ ధర్మరాజ కమిటీ ఎయిడెడ్ ప్రాథమిక స్కూల్లో జరిగిన సమావేశానికి ఉపాధి హామీ పథకం మాజీ డైరెక్టర్ ఊరందూరు సురేంద్రబాబు హాజరయ్యారు. స్కూల్ కరెస్పాండెంట్ సుశీలమ్మ పాల్గొన్నారు.

⇨ బీవీనగర్‌లోని జీవీవీఆర్ జూనియర్ కళాశాలలో జరిగిన మీటింగ్‌లో కార్పొరేటర్ చేజర్ల మహేష్ హాజరయ్యారు. జనహిత వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావు, కరెస్పాండెంట్ రామదండు, కళాశాల కోశాధికారి సుధాకర్ పాల్గొన్నారు.

⇨ స్థానిక దర్గామిట్టలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన మీటింగ్‌లో రూరల్ ఎంఈఓ మురళీధర్, డివిజన్ ఇన్‌చార్జి చెక్కా సునీల్, ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

⇨ స్థానిక ఎస్సార్ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో బంధం ఫౌండేషన్ అధినేత, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ సగిలి జయరామిరెడ్డి హాజరయ్యారు.

ప్రత్యేక దువాలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు(బృందావనం): రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బారాషహీద్ దర్గాలో గురువారం ప్రత్యేక దువా చేశారు. తన సతీమణి సుజిత, మనుమరాలు దేవిరెడ్డి సంయుక్తతో కలిసి స్వర్ణాల చెరువులో రొట్టెను పట్టుకున్నారు.

కూటమి ప్రభుత్వంలో దిగజారుడు రాజకీయాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జిల్లాలో దిగజారుడు రాజకీయాలు పెరిగిపోయాయని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున అన్నారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులతో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రసన్న ఇంటిపై దాడి, హత్యాయత్నం మంత్రి నారా లోకేశ్ ప్రోద్బలంతోనే జరిగిందన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మా పార్టీలో ఉన్నప్పుడు హుందాగా గౌరవించామన్నారు. పార్టీ మారిన తర్వాత దిగజారి రాజకీయాలు చేస్తున్నారన్నారు. దాడి జరిగిన రోజు రాత్రి ప్రసన్న ఫిర్యాదు ఇస్తే ఇప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు. అయితే ఆయన మీదనే కేసు నమోదు చేసి నాలుగు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారన్నారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్ మాట్లాడుతూ ఎంతో మంది రాజకీయ ప్రముఖులు జిల్లా నుంచి రాజకీయాలు చేశారని, కానీ ఎవరి దగ్గర ఇటువంటి సంస్కృతి



మాట్లాడుతున్న యువజన విభాగం నాయకులు

చూడలేదన్నారు. రాజకీయాల్లో ఒకరికి ఆదర్శంగా ఉండాలే తప్ప ఇలాంటి నీచ రాజకీయాలు చేయడం తగదన్నారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కడివేటి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా రాజకీయ నాయకులకు ఉమ్మడి రాష్ట్రంలోనే కాక దేశంలో కూడా హుందా రాజకీయాలు చేస్తారనే బ్రాండ్ ఉండేదని, అయితే కూటమి ప్రభుత్వంలో పూర్తిగా దిగజారిందన్నారు. అన్ని చర్యలకు సమాధానం చెప్పే రోజు దగ్గరలో ఉందన్నారు.

దాడుల సంస్కృతి తగదు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రశాంతమైన నెల్లూరు జిల్లాలో కూటమి ప్రభుత్వం దాడుల సంస్కృతికి తెర తీసిందని, ఇది మంచి పద్ధతి కాదని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి అన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆమె గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. 200 మంది టీడీపీ అల్లరిమూకలు ప్రసన్న ఇంటిపై దాడి చేసి విధ్వంసం సృష్టించారని, ఇంట్లో ఉన్న ఆయన 85 ఏళ్ల తల్లిని భయభ్రాంతులకు గురి చేశారన్నారు. జిల్లా చరిత్రలోనే ఒక మాయని మచ్చగా మిగిలిపోతుందన్నారు. పోలీసులు దాడి చేసిన వారిపై ఇంతవరకు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకుండా తాత్సారం చేయడం కూటమి ప్రభుత్వ కక్షపూరిత రాజకీయాలకు నిదర్శనమన్నారు. దీనిపై



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు గౌరి

చర్యలు తీసుకోకపోతే మహిళా విభాగం తరఫున పోరాటం చేస్తామన్నారు. అనంతరం మహిళా నేతలు కామాక్షిదేవి, ధనుజారెడ్డి, ప్రవల్లిక, బెల్లంకొండ వాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నెల్లూరు రాజకీయాలపై భయం వేస్తోందని, ఇంత జరిగినా పోలీసులు స్పందించకపోవడం చూస్తే రాష్ట్రంలో పాలన ఉందా అనే అనుమానం కలుగుతుందన్నారు. రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం సెక్రటరీ జ్యోతి పాల్గొన్నారు.

వైద్య సదస్సులు ఉపయోగకరం

నెల్లూరు(అర్బన్): జాతీయ, రాష్ట్రీయ వైద్య సదస్సులతో ఆధునిక వైద్య విధానాలు అందిపుచ్చుకోవచ్చని, ఇందువల్ల రోగులకు ఎంతో ఉపయోగకరమని నారాయణ స్పెషాలిటీ ఆస్పత్రి న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సంపత్‌కుమార్ అన్నారు. ఇటీవల నారాయణ మెడికల్ కళాశాలలో జరిగిన జాతీయ న్యూరో కాన్ సదస్సు విజయవంతం కావడంపై గురువారం డాక్టర్లు, సిబ్బందికి ఆత్మీయ అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ 623 మంది న్యూరాలజిస్టులు పాల్గొన్న సదస్సులో జాతీయ, అంతర్జాతీయ డాక్టర్లు తమ అనుభవాలను వివరించడం గొప్ప విషయమన్నారు. నారాయణ మెడికల్ కళాశాల



మాట్లాడుతున్న డాక్టర్ సంపత్‌కుమార్

ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, కో–ఆర్డినేటర్ డాక్టర్ బిజూ రవీంద్రన్, ఏజీఎం అలిమిలి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శంకరమఠంలో చండీ హోమం

నెల్లూరు(బృందావనం): కామ్యహోమ సప్తాహ మహోత్సవాల ముగింపు, ఆషాఢ పౌర్ణమి సందర్భంగా మూలాపేట శంకరమఠంలో గురువారం శ్రీవిద్య, చండీహోమాలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితులలో 150వ చండీహోమాన్ని విశేషంగా జరిపారు. మఠం ప్రాంగణంలో కొలువైన చంద్రమౌళీశ్వరస్వామిని, అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సాయంత్రం స్వస్తి వేదాశీర్వచనం జరిపారు. నిర్వాహకులు కొప్రపాటి నందకిశోర్– ఉషాకుమారి పర్యవేక్షించారు.



డయల్ యువర్ డీఎం-1 నేడు

నెల్లూరు సిటీ: నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మురళీకృష్ణ గురువారం తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు చేసేందుకు 99592 25641 నంబర్‌కు శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య సంప్రదించాలని కోరారు.

ఘనంగా ఉత్సవాలు



నెల్లూరు సిటీ: ధనలక్ష్మీపురంలోని బొల్లినేని నర్సింగ్ కళాశాలలో క్యాపింగ్ సెర్మనీ ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. వైద్యులు అభినయరెడ్డి, విజయసేన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. నూతనంగా నర్సింగ్ కోర్సుల్లో చేరిన విద్యార్థినులను అభినందించారు. కిమ్స్ హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌కుమార్, బొల్లినేని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తాళ్లూరి గిరినాయుడు, డైరెక్టర్ శివమాల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అశోక్ పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలు తగవు

• ఉపాధి హామీ ఉద్యోగుల సమాఖ్య



మాట్లాడుతున్న సమాఖ్య నాయకులు

నెల్లూరు(పొగతోట): ఉపాధి పథకం అమలులో అవినీతి జరుగుతోందని, అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించడం తగదని ఉపాధి హామీ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శంకర్ నారాయణ, పీవీ కృష్ణారావు అన్నారు. గురువారం డ్వామా కార్యాలయం ఎదుట మాట్లాడారు. బదిలీల్లో అవకతవకలు జరగలేదన్నారు. కార్యాలయంలో అవసరాల నిమిత్తం, పరిపాలన సౌలభ్యం కోసం కొన్ని మార్పులు, చేర్పులు చేయడం జరిగిందన్నారు. దీనిపై ఆరోపణలు రావడం దారుణమన్నారు. సస్పెండ్ అయిన ఉద్యోగులకు నిబంధనల ప్రకారమే పోస్టింగ్‌లు ఇస్తున్నారని తెలిపారు. ఉపాధి హామీ సిబ్బంది శ్రామికుల చేత క్షేత్ర స్థాయిలో పనులు చేయిస్తున్నారన్నారు. సిబ్బందికి జీతాలు తక్కువన్నారు. అవి కూడా సక్రమంగా ప్రతి నెలా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు ఉపాధి హామీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో బారాషహీద్ దర్గాలో భక్తులకు గురువారం మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్, డీవైఎఫ్ఐ నాయకులు రమణ, నజీర్, మస్తాన్, మునీర్, ఫయాజ్, యశ్వంత్, అమాన్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సత్యసాయి రథయాత్ర



వేడుకగా సాగుతున్న రథయాత్ర



నెల్లూరు(బారకాసు): భగవాన్ సత్యసాయి శత జయంతి రథయాత్రకు నగరంలో ఘన స్వాగతం లభించింది. సత్యసాయి ప్రేమ ప్రవాహిని (రథోత్సవం) పుట్టపర్తి దివ్యక్షేత్రం నుంచి దేశ వ్యాప్తంగా శోభాయాత్రగా నిర్వహిస్తున్నారు. ఈనెల 8న జిల్లాలో ప్రవేశించిన రథయాత్ర కందుకూరు, కావలి మీదుగా బుధవారం రాత్రికి నెల్లూరు నగరానికి చేరుకుంది. ఈ క్రమంలో సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు వి.సుధాకర్ ఆధ్వర్యంలో అత్యధిక సంఖ్యలో భక్తులు ఘన స్వాగతం పలికారు. కాగా గురువారం ఉదయం 9 గంటలకు రామ్మూర్తినగర్‌లోని సత్యసాయి మందిరం నుంచి ప్రారంభమైన రథయాత్ర స్థానిక పురవీధుల్లో కొనసాగింది. తరువాత అక్కడి నుంచి సౌత్‌ఆమలూరు, కోడూరు, ఈదూరు ప్రాంతాల్లో రథయాత్ర నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు నగరంలోని గోమతినగర్‌లో ఉన్న సత్యసాయి మందిరానికి చేరుకుంది. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మినీబైపాస్ రోడ్డు, వనంతోపు సెంటర్, బీవీనగర్, అయ్యప్పగుడి మీదుగా రాత్రికి గూడూరుకు చేరుకుంది. సాయిహృదయ భజన మందిర గౌరవాధ్యక్షుడు మురళీకృష్ణ, సేవా సమితి కన్వీనర్లు సురేష్‌సింగ్, కొండా శేషగిరిరావు, మహిళా విభాగ సేవాదళ్ ఇన్‌చార్జి నాగలక్ష్మి, సభ్యులు శ్రీధర్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరావు, బాబు, శ్రీను, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో బీఎల్‌వోలు కీలకం

నెల్లూరు(బారకాసు): ఎన్నికల నిర్వహణలో బూత్ లెవెల్ అధికారుల పాత్ర కీలకమని సిటీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, కమిషనర్ నందన్ అన్నారు. నగర నియోజకవర్గ పరిధిలోని బీఎల్‌వోలకు కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈసీఐ ఆదేశాల మేరకు ఈనెల 10, 14, 15, 16, 17వ తేదీల్లో నియోజకవర్గంలోని బీఎల్‌వోలకు శిక్షణా కార్యక్రమాలు ఉంటాయన్నారు. సమావేశంలో ఏఈఆర్ఓ షఫీమాలిక్, ఎన్నికల డీటీ ఆనంద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ నందన్

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర ప్రభుత్వం గృహ విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ 32వ డివిజన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రూరల్ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ, గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల విద్యుత్ బిల్లులు అధికంగా వస్తాయన్నారు. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నాయకులు ఖలీల్, రంగయ్య, షాన్‌వాజ్, జిలానీ, సత్యం, నౌషాద్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



యోగా గురువుకు సన్మానం



సురేంద్రనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న స్థానికులు

నెల్లూరు(బృందావనం): గురు పూర్ణిమను పురస్కరించుకుని నగరంలోని కరెంటాఫీస్ సెంటర్ రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో ముప్పవరపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా గురువు పి.సురేంద్రనాథ్ రెడ్డిని గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం యోగా సాధనతో ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చన్నారు. యాంత్రిక జీవనంలో మానసిక, శారీరక ఆరోగ్యం కోసం యోగాను జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాల్యాద్రి, రమణయ్య, వెంకటేశ్వర్లు, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.